# కొలువుదీరిన మహిళామణులు.. ఇక అభివృద్ధిపై దృష్టి



**విశ్వంభర, నిజామాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించ డంతో ఉమ్మడి జిల్లాలో మహిళలే మున్సిపల్ పగ్గాలను చేజిక్కించుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎల్లారెడ్డి మున్సిపాలిటీ మినహా నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్ సహా ఆర్మూర్, బోధన్, భీమ్?గల్, కామారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద మున్సిపాలిటీలలో మహిళలే చైర్ పర్సన్లుగా కొలువు దీరారు. పదవీ బాధ్యతలు కూడా స్వీకరించారు. మేయర్ గా, చైర్ పర్సన్లుగా కొలువుదీరిన మహిళల్లో దాదాపు అందరూ సాధారణ గృహిణులే కావడం విశేషం. భర్తలు రాజకీయాల్లో ఉన్నప్పటికీ మహిళలు ఎప్పుడు రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించిన వారు తక్కువే.రిజర్వేషన్ల పుణ్యమాని ఏకంగా మేయర్, చైర్ పర్సన్ల పీఠం పైనే కొలువుదీరాల్సిన అవకాశం దక్కింది. ఇంత వరకు బాగానే ఉంది. ఇక నుంచి తమ కార్పొరేషన్ పరిధిలో, తమ తమ మున్సిపాలిటీల పరిధిలో అభివృద్ధి పనులపై ఫోకస్ చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఇన్నాళ్లూ ఇంటి బాగోగులు, పిల్లల ఆలనా పాలనా చూసే బాధ్యతల నుంచి ఏకంగా ప్రజల బాగోగులు పట్టణ, నగర బాగోగులు చూసే బాధ్యతను భుజాలపై మోయాల్సి వచ్చింది. ఈబాధ్యతలు కొంత కొత్తగా భయంభయంగా అనిపించినా తోడుగా తమ తమ భర్తలున్నారనే ధైర్యంతో ముందడుగేసే ఆలోచనలో ఉన్నారు మహిళా ప్రజాప్రతినిధులు.

**డ్రైనేజీలు, అంతర్గత రోడ్లే ప్రధాన సమస్యలు..**

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సహా ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ప్రజలను వేధిస్తున్న సమస్యలు, ప్రజా ప్రతినిధులకు ప్రజల్లో ఇబ్బందికర పరిస్థితులను సృష్టించే సమస్యలు ముఖ్యంగా ఇవే కావడంతో వాటిపైనే ముందుగా దృష్టి పెట్టే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పైగా అన్ని చోట్లా కాంగ్రెస్ పార్టీ కి చెందిన వారే అధికార పీఠంలో కొలువు దీరడంతో రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధుల ప్రవాహానికి ఏం కొదవ ఉండదనే ధైర్యం ప్రజాప్రతినిధుల్లో కనిపిస్తోంది. దీనికి తోడు సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్? మహేశ్ కుమార్ గౌడ్ సహా రాష్ట్ర మంత్రులు కూడా మున్సిపాలిటీలకు, కార్పొరేషన్ కు అధిక మొత్తంలో నిధులు కేటాయిస్తామని, నిధుల కొరత లేకుండా, అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించేందుకు సహకరిస్తామని చెప్పడం కొత్తగా బాధ్యతలు చేపట్టిన మేయర్, వైస్ చైర్ పర్సన్లకు ఊరటనిచ్చే అంశంగా చెప్పవచ్చు.

**నాలాల ఆక్రమణల సమస్య పరిష్కారమయ్యేనా?**

నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో ప్రధాన ప్రాంతాల్లో నాలాలు కబ్జాకు గురయ్యాయి. నాలాల పైనే పక్కా నిర్మాణాలు చేయడంతో నాలాలు కనుమరుగైపోయాయి. దీంతో నాలాల్లో ప్రవహించాల్సిన మురుగు నీరు రోడ్ల పైకి చేరి పలు ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురై రోగాల పాలవుతున్నారు. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు నగరంలోని నాలాల్లో పారా ల్సిన నీరు నాలాలపైకి చేరి రోడ్లన్నీ జలమయమవుతాయి. గత రెండు, మూడు సీజన్లలో వరుసగా నాలాల్లో చిన్నారులు గల్లంతైన విషాధకర ఘటనలు చోటు చేసుకున్నాయి. వీటన్నింటికి కారణం నాలాల ఆక్రమణే అన్న సంగతి నగరంలోని ప్రతిఒక్కరికీ తెలుసు. ప్రజాప్రతినిధులకైతే ఈ విషయం బాగా తెలుసు. కానీ, రాజకీయ లబ్ధి కోసం నాలాల ఆక్రమణపై కొరడా జులిపించడం లేదు.

**హాస్పిటల్స్ కు అడ్డా.. ఖలీల్ వాడీ గడ్డ..**

నిజామాబాద్ నగరంలోని హాస్పిటల్స్ కు అడ్డాగా ఉన్న ఖలీల్ వాడీ ప్రాంతంలో దాదాపు 70 శాతం హాస్పిటల్ నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినవే. రోడ్లను కబ్జా చేసి కట్టినవే. కళ్లముందు స్పష్టంగా సాక్షాత్కరిస్తున్నా మున్సిపల్ అధికారులు కానీ, పాలక వర్గం కానీ, కలెక్టర్ సహా సంబంధిత ఏ అధికారీ కూడా చర్యలు తీసుకోరు. ఎందుకంటే రోజూ రూ. లక్షల్లో సంపాదించే డాక్టర్లు ప్రజా ప్రతినిధులను, అధికారులను కరెన్సీ కట్టలతో కొనేస్తారని, వారి నోళ్లు మూయించేస్తారనే ఆరోపణలున్నాయి. జనాలు అన్నట్లే.. వీరు చేసినట్లే నన్న చందంగా ఖలీల్ వాడీలో కొత్తగా నిర్మిస్తున్న హాస్పిటల్ భవనాలు కూడా రోడ్లను ఆక్రమించి నిర్మిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కార్పొరేషన్ అంటే పారిశుధ్యం, అంతర్గత రోడ్లు ఇతర సమస్యలే కాదు.ప్రజా జీవితానికి ఆటంకం కలిగించే విధంగా రోడ్లను ఆక్రమించి నిర్మిస్తున్న కట్టడాలను కూడా నిరోధించాల్సిన బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్ అధికారుపైనా, కొత్తగా ఎంపికైన పాలకవర్గం పైనా ఉంది. ముఖ్యంగా నగర మేయర్ దీనిపై ఎక్కువ బాధ్యతగా స్పందించాల్సిన అవసరముంది. ఆర్మూర్, బాన్సువాడ, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బోధన్ వంటి మున్సిపాలిటీల్లో కూడా ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. రోడ్లు, డ్రైనేజీలే కాకుండా మున్సిపాలిటీకి చెందిన స్థలాలు కూడా కబ్జాలకు గురవుతున్న సందర్భాలున్నాయి. వీటన్నింటిపైనా కొత్తగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నగర మేయర్ , మున్సిపల్ చైర్ పర్సన్లు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. మహిళలు వంటింటి కుందేళ్లు కాదు.. అధికార పగ్గాలు చేతికిస్తే ఎవరూ సాధించని విజయాలు సాధించి చూపుతామని, అసాధ్యాలను సుసాధ్యం చేస్తామని నిరూపిస్తామనిపించుకునేలా పని తీరును ప్రదర్శించాలని ప్రజలు కోరుతున్నారు. రాబోయే ఐదేళ్ల కాలంలో ఎన్నో విజయాలు సాధించాలని, మహిళలు నిజంగా మహారాణులేనని నిరూపించుకోవాలని దిశ ఆల్ ది బెస్ట్ చెపుతోంది.

## ఖాదీ అంటే కలెక్షన్లు కాదు.. సేవ
## ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి



**విశ్వంభర, కామారెడ్డి:** ఖాదీ అంటే కలెక్షన్లు కాదు, సర్వీస్ దిశగా నేను పని చేస్తున్న అని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి అన్నారు. కామారెడ్డి క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి మాట్లాడారు. "నేను లెటర్లు రాస్తే వచ్చిన నిధులను తానే తెచ్చామని చెప్పుకుంటూ ఇంచార్జీ మంత్రిని తీసుకువచ్చి షబ్బీర్ అలీ ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. గత రెండు ఏళ్లుగా కామారెడ్డి నియోజకవర్గంలో నేను ఏమి మాట్లాడకుండా ఉంటే.. ఈ నియోజకవర్గానికి నవాబులాగా షబ్బీర్ అలీ చెలాయిస్తున్నారు. ఎదుటి వాళ్ళు బూతులు మాట్లాడే స్థాయికి నీ ప్రవర్తన మారింది.ప్రభుత్వ కళాశాలకు చెందిన భూములను లీజు కు ఇవ్వడం ద్వారా ప్రభుత్వ కళాశాలకు ఆ స్థలాల కిరాయిలు వస్తున్నాయి. కళాశాల భూములకు సంబంధించి ఓ కాంగ్రెస్ నాయకుడు చేసిన విమర్శలకు అతన్ని ప్రభుత్వ కళాశాల వద్దకు చర్చకు రమ్మంటే కాంగ్రెస్ నాయకులు వందల సంఖ్యలో వచ్చి నా క్యాంపు కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయ కులు దాడికి యత్నించారు. నేను చేసిన సవాల్ కు ఉదయం ప్రభుత్వ కళాశాల వద్దకు వద్దామంటే కామారెడ్డి శాంతి భద్రతల దృష్ట నన్ను బయటకి రావద్దంటే వారికి సహకరించి నేను బయటకు రాలేదు. ప్రభుత్వ కళాశాల ఆస్తుల విషయంలో నేను ఏమైనా అవినీతి చేసినట్టు ప్రూఫ్స్ తో నిరూపిస్తేనేను నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఏర్పడ్డ తెలంగాణయూనివర్సిటీని కామారెడ్డి ప్రభుత్వ కళాశాల స్థలంలో ఏర్పాటు చేయాలని నేను అప్పటి ముఖ్యమంతి రాజశేఖర్ రెడ్డి తో మాట్లాడినా. అప్పుడు ఈ షబ్బీర్ అలీ మంత్రి హోదాలో ఉండి కూడా కామారెడ్డికి ఏమి చేయని వ్యక్తి.నేను తప్పు చేసినట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా." అని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి అన్నారు.



గంధ రమేష్ , రజనీల కూతురు ఆకాంక్ష, సాయి కిరణ్ ల నిశ్చితార్థ వేడుకకు హాజరై ఆ జంటను ఆశీర్వదించిన వి 3 ఛానెల్, విశ్వంభరా దినపత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ, కాచం సుష్మ దంపతులు. ఈ కార్యక్రమంలో కాసం శేఖర్, శోభ, మంగ, లీల తదితరులు పాల్గొన్నారు.
**( విశ్వంభర, హైదరాబాద్)**

# డిజిటల్ రంగంలో సరికొత్త విప్లవాత్మకమైన మార్పు




## 50 వేలకు పైగా యువతకు ఉపాధి కల్పన కల్పించాం
## అడ్వాన్స్ ఇండియా ఇనిషియేటివ్ వ్యవస్థాపకులు సురభి

**విశ్వంభర, హైదరాబాద్:**

: హైదరాబాద్ అడ్వాన్స్ ఇండియా ఇనీషియేటివ్ ప్రారంభం. కింగ్ వెల్, స్వ్యాసిస్ భాగస్వామ్యంతో ప్రముఖ హెచ్ ఆర్ నిపుణులు, వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులను ఒకే చోటు ఏర్పాటు. యువతకు మరింత ఉద్యోగ, ఉపాధి కల్పన లక్ష్యంగా ముందడుగు వేసిన అడ్వాన్స్ ఇండియా ఇనీషియేటివ్. హెచ్ఆర్ నిపుణులను తయారు చేయడం, దేశ ఆర్థికాభివృద్ధి బలోపేతం చేయడం, విదేశీ డిజిటల్ తగ్గించడం మరియు ఆవిష్కరణ, నైపుణ్యాలు, మానవ వనరుల అభివృద్ధి ఆధారంగా స్వావల ంబన దేశాన్ని నిర్మించడంపై ఈ సంస్థ ముఖ్య ఉద్దేశమాని వ్యవస్థాపకురాలు సురభి అన్నారు. స్థాపకురాలు శ్రీమతి సురభి నాయకత్వంలో ఈ ఇనిషియేటివ్ దేశాభివృద్ధి, సామాజిక బాధ్యత మరియు ఆర్థిక సాధికారతపై ఆధారపడిన దృష్టిని ప్రతిబింబిస్తుంది. దేశభక్తి మరియు దూరదృష్టి కలిగిన నాయకురాలిగా గుర్తింపు పొందిన శ్రీమతి సురభి, ఉపాధి సృష్టి, నైపుణ్యాభివృద్ధి మరియు దేశనిర్మాణం పై కేంద్రీకృతమైన కార్యక్రమాల ద్వారా సమాజానికి నిరంతరం సేవలందిస్తున్నారు. ఆమె మార్గదర్శక తత్వం దేశాన్ని అన్నిటికంటే ముందుగా ఉంచుతుంది; స్థిరమైన పురోగతి ప్రజలను సాధికారులను చేయడం మరియు భారతదేశ స్వావలంబనను బలోపేతం చేయడం ద్వారా సాధ్యమవుతుందని ఆమె నమ్మకం.ఈ కార్యక్రమం హెచ్ఆర్ నాయకులకు భారతదేశ ప్రతిభా వ్యవస్థను బలోపేతం చేయడం, విదేశీ డిజిటల్ వ్యవస్థలపై ఆధారాన్ని తగ్గించడం మరియు ఆవిష్కరణ, నైపుణ్యాలు, మానవ వనరుల అభివృద్ధి ఆధారంగా స్వావలంబన దేశాన్ని నిర్మించడంపై సార్థక చర్చలు జరిపే సహకార వేదికగా నిలిచింది.డిజిటల్ సార్వభౌమత్వం కోసం దూరదృష్టి.. అడ్వాన్స్ ఇండియా ఇనిషియేటివ్ భారతదేశం తన స్వంత డిజిటల్ భవిష్యత్తును స్వయంగా నిర్మించుకునేలా దేశీయ సామర్థ్యాలను అభివృద్ధి చేయడం, సాంకేతిక స్వతంత్రతను బలోపేతం చేయ డం మరియు ఆవిష్కరణ ఆధారిత వృద్ధిని ప్రోత్సహించడం అనే ధైర్యవంతమైన దృష్టితో నడుస్తోం ది. జాతీయ డిజిటల్ మౌలిక సదుపాయాలు మరియు మేధో సంపత్తిని దేశంలోనే సృష్టించడం, నిర్వహించడం మరియు యాజమాన్యం వహించడం ద్వారా డిజిటల్ సార్వభౌమత్వాన్ని ప్రోత్సహిస్తోంది.వ్యూహాత్మక భాగస్వాములు స్వ్యాసిస్ మరియు కింగ్స్‌వెల్ హెచ్ఆం, స్టాఫింగ్ రంగా లలో 30 ఏళ్లకు పైగా అనుభవాన్ని కలిగి ఉన్నారు. ఐదు దేశాలలో కార్యకలాపాలు నిర్వహిస్తూ, గత మూడు దశాబ్దాలలో 50,000కు పైగా నిపుణులకు ప్రపంచవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు కల్పించారు.

**లక్షలాది భవిష్యత్తు అవకాశాల సృష్టి..**

ఈ ఇనిషియేటివ్ ప్రధాన లక్ష్యం భారతదేశాన్ని ప్రపంచంలోని అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి దోహదపడడం. విద్య, పరిశ్రమ అవసరాలు , అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల మధ్య సమన్వయం సాధించడం ద్వారా, విద్యార్థులు మరియు యువ నిపుణులకు లక్షలాది ఉపాధి అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది. భవిష్యత్‌కు అనుగుణమైన నైపుణ్యాలు మరియు స్థిరమైన కెరీర్ మార్గాలను అందించడం ఈ ప్రయత్నంలో ముఖ్య భాగం.ఈ సంభాషణలో పాల్గొన్న హెచ్ఆర్ నాయకులు పరిశ్రమ, విద్యాసంస్థలు మరియు విధాననిర్మాతల మధ్య సహకారం భారత దేశ వేగవంతమైన ఆర్థిక వృద్ధిని మద్దతు ఇచ్చే విస్తృత ఉపాధి వ్యవస్థల నిర్మాణానికి కీలకమని అభిప్రా యపడ్డారు.అడ్వాన్స్ ఇండియా ఇనిషియేటివ్ స్థాపకురాలు శ్రీమతి సురభి మాట్లాడు తూ:" భారతదేశం కేవలం చరిత్రగల దేశం మాత్రమే కాదు .. అది అపారమైన అవకాశాల దేశం. నేడు మన బాధ్యత స్వావలంబనతో, డిజిటల్ సార్వభౌమత్వంతో నిలిచే భారతదేశాన్ని నిర్మించడం. మన యువత విదేశాలకు అవకాశాల కోసం వెళ్లకుండా, అవకాశాలను సృష్టించే శక్తిగా ఎదగాలి. అడ్వాన్స్ ఇండియా ఇనిషియేటివ్ ద్వారా మన ప్రజలను సాధికారులను చేస్తూ, సామర్థ్యాలను బలోపేతం చేస్తూ, భారత భవిష్యత్తును భారతీయులే తీర్చిదిద్దే దిశగా ముందుకు సాగుతున్నాం. దేశం కంటే ముందు ఏదీ లేదు. సమిష్టి కృషి, ఆవిష్కరణ మరియు ఐక్యతతో ప్రపంచ ఆర్థిక నాయకత్వాన్ని సాధిస్తూ, లక్షలాది మందికి గౌరవప్రదమైన ఉపాధి అవకాశాలు కల్పించే భారతదేశాన్ని నిర్మించగలము."




మొయినాబాద్ అజీజ్ నగర్ నీవా కన్వెన్షన్ హాల్ లో గందె రవీందర్ , కళ్యాణిల కుమారుడు కౌటిల్య ,సౌమ్య ల నిశ్చితార్థం వేడుక కు హాజరై ఆ జంటను ఆశీర్వదించిన వి 3 ఛానెల్, విశ్వంభర దినపత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ, సుష్మ దంపతులు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాచం నిఖిత తదితరులు పాల్గొన్నారు. **( విశ్వంభర, మొయినాబాద్)**



హనుమకొండ హాసన్ పర్తి సైనీ గార్డెన్స్ లో ఏసిపి గిరి కుమార్, గీతా రాణిల కుమారుడు నిఖిల్, శ్రీశైలి ల వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించిన వి 3 ఛానెల్, విశ్వంభర దినపత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ, సుష్మ దంపతులు. ఈ కార్యక్రమంలో కంచనపల్లి జవహర్ లాల్, రమణ, సుమ తదితరులు పాల్గొన్నారు. **( విశ్వంభర, వరంగల్)**

## డిజె సౌండ్ సిస్టం నిర్వాహకులపై కేసు నమోదు

**విశ్వంభర, సరూర్ నగర్:**



ఏర్పాటు చేసి, ప్రజలకు అసౌకర్యం కలుగుతుందని డయల్ 100 కాల్ రాగా వెంటనే పోలీసు వారు స్పందించి అక్కడికి చేరుకొని నిబంధనలు ఉల్లంఘించి అధిక శబ్దంతో ప్రజలకు అసౌకర్యం కలిగించినందుకు వారి పైన కేసు నమోదు చేసి డీజే సిస్టమ్, 6 స్పీకర్లు , 1 యాంప్లిఫైర్‌ను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గుర్తు తెలియని మహిళ మృతి

**విశ్వంభర, ఎల్బీనగర్:** గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 20వ తేదీన ఒక గుర్తు తెలియని మహిళ(50) తలకు బలమైన గాయం తో పడి ఉండగా, చుట్టూ ప్రక్కల వారు చూసి ఆమెను ఉస్మానియా హాస్పిటల్ కు తరలించారు. మహిళ చికిత్స పొందుతూ శనివారము మృతి చెందింది. ఆమె ఆచూకీ , వివరాలు గురించి విచారించగా మహిళ పేరు మేరీ అని ఈమె కళ్ళ దుఖానాల దగ్గరకు వస్తు ఉండేదని తెలిసినది. పూర్తి వివరాలు ఇంకా తెలియవలసి ఉంది. మహిళ నీలం రంగు చీర , పచ్చని రంగు గల జాకెట్ ధరించి ఉంది అని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## మహిళల సాధికారిక కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన త్యాగం మరువలేనిది

### అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవేందర్ కుమార్



విశ్వంభర, సూర్యాపేట: అనాదిగా అణచివేతలకు గురి అవుతున్న స్త్రీల అభ్యుదయ కోసం మహిళా సాధికారత కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన త్యాగం వారి సేవలు మర్చిపోలేము అని సూర్యాపేట జిల్లా కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవేందర్ కుమార్ ,జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపెల్లి లింగయ్య యాదవ్ అన్నారు. సంఘమిత్ర ఎడ్యుకేషనల్ చారిటబుల్ సొసైటీ అధ్యక్షులు న్యాయవాది తల్లమల్ల హసేన్ ఆధ్వర్యంలో స్పందన డిగ్రీ కళాశాల లో మాత రమాబాయి అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని మహిళా సాధికారికత అంశం పైన సెమినార్ నిర్వహించారు.వారు మాట్లాడుతూ మనదేశంలో కుల మత వర్గాలకు అతీతంగా అన్ని వర్గాల మహిళల కోసం వారి హక్కుల కోసం ప్రధమ న్యాయ శాఖ మంత్రిగా ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్త్రీల అభ్యున్నతి కోసం హిందూ కోడ్ బిల్లును ప్రవేశపెట్టారని ఆ బిల్లును తిరస్కరించిన ప్రభుత్వానికి నిరసనగా తన న్యాయశాఖ మంత్రికి రాజీనామా చేసిన గొప్ప త్యాగశీలి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని అంబేద్కర్ సేవలను కొనియాడారు . ఈ కార్యక్రమంలో జె శశిధర్ , నటరాజ్ షాక్యా ,డాక్టర్ కె రంగారెడ్డి ,వసంత, సత్యనారాయణ, రమాదేవి, ఏడిండ్ల అశోక్ ,స్పందన డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ తీకుల్ల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులపై ఉంటుంది
## బహదూర్పుర డిప్యూటీ ఐఓఎస్ వెంకట్ రెడ్డి



విశ్వంభర, చార్మినార్: విద్యార్థుల యొక్క భవిష్యత్తు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మీదనే ఉంటుందని బహదూర్పుర డిప్యూటీ ఐఓఎస్ వెంకట్ రెడ్డి అన్నారు. శనివారము ప్రభుత్వ బాలుర అందుల ప్రాథమిక పాఠశాల దారుల్ షిఫా లో తల్లిదండ్రులు , ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వెంకట్ రెడ్డి హాజరై మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ యొక్క పిల్లలని ప్రతిరోజు పాఠశాలకు పంపించాలని వారి యొక్క బాగోగులు చూసుకోవాలని పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు చక్కగా చదువులు నేర్పించి వారి యొక్క భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రాథమిక తరగతులు పూర్తయ్యేసరికి విద్యార్థులకు భాషలో చదవడం రాయడం విని అర్థం చేసుకొని స్పందించేటట్లు ఉండాలని గణితంలో చతుర్విధ ప్రక్రియలు నేర్చుకొని రాత లెక్కలు కూడా అర్థం చేసుకొని విద్యార్థులు చేసేటట్లు ఉండాలని ఉపాధ్యాయులను ఉద్దేశించి అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ప్రతి రోజు పాఠశాలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. అప్పుడే విద్యార్థులు చక్కగా చదువుకోగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజాద్ ఖాన్, రవికాంత్, రవీందర్ రెడ్డి, జానయ్య, మలీహ, తల్లిదండ్రులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ధనిక సిల్వర్ జువెల్లర్స్ ప్రారంభోత్సవం
## ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొన్న ప్రముఖ నటి తేజశ్విని

**విశ్వంభర, హైదరాబాద్ :** ధనిక సిల్వర్ జువెల్లర్స్ ప్రారంభోత్సవం దిల్ సుఖ్ నగర్ లో ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అలాగే ప్రముఖ నటి తేజశ్విని సిల్వర్ జువెల్లర్స్ కు విచ్చేసి సందడి చేశారు. వీరివురు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ధనిక సిల్వర్ జువెల్లర్స్ చైర్మన్ మధు బాబు కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేసారు. నాణ్యమైన ఆభరణాలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వ్యాపారం లాభసాటిగా జరగాలని వారు తెలిపారు. టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త , మాజీ కార్పొరేటర్ జిన్నారం విట్టల్ రెడ్డి , మొగుళ్లపల్లి ఉపేందర్ , మలక్పేట్ శైలజ పలువురు రాజకీయ ప్రముఖులు , ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

